

వార్తలతో కదిలినయంత్రాంగం

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -11 శనివారం 6 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

**ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ**

**రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం**

**ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి**

**ముంబై, జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత,**మిగతా 2లో...**



# దేశంలో కొందరు నిరాశావాదులు

**అత్మనిర్భర్ భారత్', దేశ దృఢ సంకల్పన్ని విమర్శిస్తుంటారు**

**సూరత్ సభలో రాహుల్‌పై ప్రధాని మోడీ పరోక్ష విమర్శలు**



**న్యూఢిల్లీ, జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**
దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'అత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పన్ని విమర్శించడమే వీళు పనిగా పెట్టుకున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అలజడలు, అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా అవకాశాలు పొందాలని కోరుకుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తున్నారని ప్రధాని అన్నారు. **మిగతా 2లో...**



# వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

**గండిపేట భూ కుంభకోణం కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**నకిలీ జీవోలతో ప్రభుత్వ భూముల కబ్జాకు యత్నించినట్లు ఆరోపణలు**

**పరారీలో ఉండగా తమిళనాడులోని కాంచీపురంలో పట్టుబడ్డ బ్రహ్మనాయుడు**

**హైదరాబాద్ జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**
హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగుచూసిన వేల కోట్ల రూపాయల భూ కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. **2లో...**

# పాలనపై చర్చిద్దామా

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండి**

**ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతాం**

**ఎంపిగా గెలిపిస్తే పాలమూరు ఒరగబెట్టిందేమీ లేదు**

**మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటా**

**నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణెళి మా లక్ష్యం**

**జడ్చర్ల సభలో కెసిఆర్‌కు సిఎం రేవంత్ సవాల్**



**జడ్చర్ల, జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**
నీ పదేళ్ల పాలన.. నా రెండున్నరేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా? అంటూ కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా.. ఈ చర్చలో ఓడితే తాను దేనికైనా సిద్ధమని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం జడ్చర్ల పరజాపాలన–ప్రగతి ప్రణాళిక సభ వేదికపై నుంచి నిప్పులు చెరిగారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిన చోట మీరు ఓట్లు అడగండని కేసీఆర్‌కు సీఎం రేవంత్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టిన దగ్గర మేం ఓట్లు అడుగుతామన్నారు. మీకు డిపాజిట్లు వస్తే.. నా పేరు మార్చుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాసి పెట్టుకో కేసీఆర్.. పాలమూరులో మీ జెండా ఎగరనివ్వమని హెచ్చరించారు

# జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్

**అధికారికంగా ఖరారు చేసిన పవన్ కల్యాణ్**

**శనివారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేయనున్న రమేష్**

**కష్టకాలంలో నిలిచినందుకే పదవి అన్న జనసేన**

**2015 నుంచి పవన్ వెన్నంటి ఉన్న లింగమనేని రమేష్**



**అమరావతి జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**
జనసేన పార్టీకి కేటాయించిన రాజ్యసభ స్థానానికి అభ్యర్థిగా పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ పేరును పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. లింగమనేని రమేష్ శనివారం **మిగతా 2లో...**

# జీవో 77 ప్రకారమే పోస్టుల భర్తీ

**డీఎస్సీ నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్ పై ప్రభుత్వ సమగ్ర వివరణ**

**సుప్రీంకోర్టు ఆదేశాల అమలు అని వెల్లడి**

**అమరావతిజూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**
ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ నియామకాలపై అభ్యర్థులు, మీడియా, సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్న సందేహాలు, ఆరోపణలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో వివరణ ఇచ్చింది. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, శాప్ ఎండీ భరణి తదితర ఉన్నతాధికారులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రతి నియామకం నిబంధనల మేరకే జరిగిందని, ఎక్కడా ఎలాంటి అక్రమాలకు తావులేదని తేల్చిచెప్పారు. ముఖ్యంగా, హారిజాంటల్ రిజర్వేషన్ విధానంపై చాలా మందికి సరైన అవగాహన లేకపోవడం వల్లే ఈ అపోహలు తలెత్తుతున్నాయని వారు పేర్కొన్నారు. **2లో...**




# జల హక్కులను కాపాడాలి

**కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణది కనిష్ట స్థాయి**

**లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు (24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి**

**తగిన నిధులు కేటాయించి పనులను పూర్తి చేయాలి :**

**సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ**



# బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

**నిధులు,నియామకాలు, నీళ్లలో వైఫల్యం**

**బిజెపి కోసం ప్రజలు ఆశగా చూస్తున్నారు**

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**మహబూబాబాద్,జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు,




# కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ ఇండ్లు

**ఆ స్థలాల్లో మహిళలకు వాటా కల్పిస్తాం**

**: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**హైదరాబాద్ జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**
పేదల జీవనోపాధికి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్ గా తీసుకొని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ (ఎల్‌ఐజీ), మధ్యతరగతి వర్గాలకు (ఎంఐజీ) లక్ష ఇండ్లు నిర్మించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. **మిగతా 2లో...**



# యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

మొదటిపేజీ తరువాయి

పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం.
ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో
కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు.
పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.

# జీవో 77 ప్రకారమే పోస్టుల భర్తీ

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రెండు రకాల రిజర్వేషన్లు అమలవుతాయని అధికారులు వివరించారు. అవి వర్టికల్ (నిలువు) మరియు హారిజాంటల్ (అడ్డం) రిజర్వేషన్లు.
వర్టికల్ రిజర్వేషన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వంటి సామాజిక వర్గాలకు కల్పించే రిజర్వేషన్‌ను వర్టికల్ రిజర్వేషన్ అంటారు. దీనికోసం 100 పాయింట్ల రోస్టర్ విధానం అమల్లో ఉంటుంది. ఇందులో ప్రతి కేటగిరీకి నిర్దిష్ట రోస్టర్ పాయింట్లు కేటాయించి ఉంటాయి. ఈ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు మెరిట్ ఆధారంగా ఓపెన్ కేటగిరీలో కూడా పోటీ పడవచ్చు. దీనివల్ల కొన్నిసార్లు ఆయా వర్గాలకు నిర్దేశించిన శాతం కంటే ఎక్కువ మంది ఎంపికయ్యే అవకాశం ఉంటుంది.
హారిజాంటల్ రిజర్వేషన్: మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, క్రీడాకారులు వంటి ప్రత్యేక కేటగిరీలకు కల్పించేది హారిజాంటల్ రిజర్వేషన్. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం, ఈ కేటగిరీలకు నిర్దిష్ట రోస్టర్ పాయింట్లు ఉండవు. మొత్తం నియామకాల్లో నిర్దేశిత శాతం (ఉదాహరణకు మహిళలకు 33.3%) ఉండేలా చూడటమే దీని ఉద్దేశం.
పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఈ విధానాన్ని ఒక బస్సు ఉదాహరణతో సులభంగా వివరించారు. "ఒక బస్సులో 100 మంది ప్రయాణికులను ఎక్కించాలనుకుంటే, అందులో 33 మంది మహిళలు తప్పనిసరిగా ఉండాలి. లైన్‌లో ఉన్నవారిని వరుసగా ఎక్కిస్తున్నప్పుడు, మొదటి 66 మందిలోనే 33 మంది మహిళలు ఉంటే, మిగతా సీట్లను లైన్ ప్రకారం భర్తీ చేస్తాం. ఒకవేళ అలా జరగకపోతే, 66 మంది తర్వాత లైన్‌ను ఆపి, చివర్లో ఉన్న మహిళలను ముందుకు పిలిచి బస్సు ఎక్కిస్తాం. అప్పుడు లైన్‌లో ముందున్న పురుషులు అన్యాయం జరిగిందంటే కుదరదు. ఎందుకంటే రిజర్వేషన్ విధానం అదే" అని ఆయన స్పష్టం చేశారు.

**జీవో 77 అమలు, సుప్రీంకోర్టు ఆదేశాలు**

గతంలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా హారిజాంటల్ రిజర్వేషన్ కేటగిరీలకు వర్టికల్ విధానంలోనే రోస్టర్ పాయింట్లు కేటాయించేవారని, అయితే సుప్రీంకోర్టు పలు తీర్పులలో (అనిల్ గుప్తా కేసు, రాజేష్ కుమార్ దరియా కేసు) ఈ విధానం సరికాదని స్పష్టం చేసిందని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర నిబంధనలను మార్చేందుకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ సిఫార్సుల మేరకు 2023 ఆగస్టు 2న జీవో 77 జారీ చేయబడింది. ఈ జీవో ప్రకారమే మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, క్రీడాకారుల కోటాను హారిజాంటల్ విధానంలో భర్తీ చేశారు. డీఎస్సీ-2024 ఈ జీవో తర్వాత జరిగిన మొదటి పెద్ద నియామక ప్రక్రియ కావడంతో, అభ్యర్థుల్లో గందరగోళం నెలకొందని వారు అభిప్రాయపడ్డారు.

**అభ్యర్థుల ఆరోపణలు - అధికారుల వివరణ**

గత కొద్దిరోజులుగా మీడియా, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న సుమారు 26 కేసులను అధికారులు ఉదాహరణలుగా తీసుకుని వివరణ ఇచ్చారు.
కాల్ లెటర్ వచ్చినా ఉద్యోగం రాలేదు: కాల్ లెటర్ కేవలం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసమేనని, అది ఉద్యోగ నియామకానికి హామీ కాదని ప్రతి కాల్ లెటర్‌లో స్పష్టంగా పేర్కొన్నామని తెలిపారు. 1:1 పద్ధతిలో వెరిఫికేషన్‌కు పిలిచినప్పుడు, కొన్ని ప్రత్యేక కేటగిరీలలో (ఉదా: దివ్యాంగులు) అర్హులైన అభ్యర్థులు చివరి నిమిషంలో అందుబాటులోకి వస్తే, మెరిట్ జాబితాలో మార్పులు జరగడం సహజమని, దానివల్ల మొదట పిలిచిన వారికి అవకాశం కోల్పోయే పరిస్థితి రావచ్చని వివరించారు.
తక్కువ ర్యాంకు వారికి ఉద్యోగం: ఇది పూర్తిగా హారిజాంటల్ రిజర్వేషన్ అమలు వల్లే జరిగిందని స్పష్టం చేశారు. ఒక కేటగిరీలో (ఉదా: బీసీ-ఏ) మహిళా అభ్యర్థులు నిర్దేశిత సంఖ్యలో లేనప్పుడు, మెరిట్ జాబితాలో చివరన ఉన్న పురుష అభ్యర్థిని తొలగించి, ఆ కేటగిరీకి చెందిన మహిళా అభ్యర్థికి (ర్యాంకుతో సంబంధం లేకుండా) అవకాశం కల్పించడం జరిగిందన్నారు.
స్పోర్ట్స్ కోటా వివాదాలు: స్పోర్ట్స్ కోటా ఎంపిక ప్రక్రియను శాప్ ఎండీ వివరించారు.
సర్టిఫికెట్ల ప్రామాణికత: క్రీడా సర్టిఫికెట్లను ప్రభుత్వం కాకుండా, సంబంధిత క్రీడా సంఘాలు, సమాఖ్యలు జారీ చేస్తాయని, వాటి ప్రామాణికతను నిర్ధారించుకున్న తర్వాతే పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు.
ఆన్‌లైన్ దరఖాస్తే అంతిమం: అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఏ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశారో వాటిని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించినా, ఆన్‌లైన్‌లో ఆ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయని ఒక అభ్యర్థి కేసును ఉదాహరణగా చూపారు.ప్రాధాన్యతా క్రమం: జీవో 4 ప్రకారం ఒలింపిక్స్ నుంచి రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ వరకు ప్రాధాన్యత ఉంటుందని, ఆ క్రమంలోనే ఎంపికలు జరిగాయని వివరించారు. టీమ్ ఈవెంట్ల కంటే వ్యక్తిగత ఈవెంట్లకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

# పాలనపై చర్చిద్దామా

.మొదటిపేజీ తరువాయి

పాలమూరు ప్రాజెక్టుకు డిసెంబర్‌లోగా 90 టీఎంసీలు నీటిని సాధిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నీటి సమస్యలపై పక్క రాష్ట్రాలతో చర్చలు వద్దా? అని కేసీఆర్ తీరును ఎండగట్టారు. తాను చర్చలు చేస్తానంటే బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఏపీతో చర్చలు జరుపుతామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన ప్రాజెక్టుల పునరుద్ధరణెళి తన లక్ష్యమని సీఎం రేవంత్ ప్రకటించారు. వలసలు, ఆత్మహత్యల కష్టనష్టాలు మనకు తెలుసునన్నారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన కేసీఆర్‌ను గెలిపించారని వివరించారు. ఎంపీగా గెలిచిన కేసీఆర్ కనీసం ప్రజలను కలవడానికి కూడా రాలేదన్నారు. కష్టకాలంలో ఆదుకున్న పాలమూరును కేసీఆర్ పట్టించుకోలేదని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చారు కానీ కేసీఆర్ చేసిందేమీ లేదన్నారు. పాలమూరు నుంచి పారిపోయిన కేసీఆర్ ద్రోహి అవుతారా? లేక నేనా? అని ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదంటూ కేసీఆర్‌పై మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నేతలు పాదయాత్ర చేస్తామంటున్నారని సీఎం రేవంత్ వ్యంగ్యంగా అన్నారు. కాశీ వరకు పొర్లు దండాలు చేసినా మీ పాపాలను ఎవరూ మరిచిపోరని ఆ పార్టీ నేతలకు స్పష్టం చేశారు. కేసీఆర్ ఎప్పుడైనా రైతుల కష్టాల గురించి ఆరా తీశారా? అని ప్రశ్నించారు. మేక వన్నె పులిలాంటి కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరని పేర్కొన్నారు. కేసీఆర్ తర్వాత ఆయన కొడుకు, మనవడు రాజ్యాలు ఏలుతారా? అని నిలదీశారు. నాడు మిడ్జిల్ నుంచి తాను జెడ్పీటీసీగా గెలిచానని గుర్తు చేశారు. 2006లో మీరు నాటిన మొక్కే ఇప్పుడు వృక్షమై మీ ముందుందని ప్రజలను ఉద్దేశించి సీఎం రేవంత్



వ్యాఖ్యానించారు. నాడు మీరు గెలిపించిన ఈ జెడ్పీటీసీ ఇప్పుడు రాష్ట్రానికి సీఎం అయ్యారని వివరించారు. కేసీఆర్ కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే మనవాళ్లే ఉండాలన్నారు. ఆత్మగౌరవంతో బతకాలంటే ఇందిరమ్మ ఇల్లు ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదన్నారు. బీఆర్‌ఎస్ నేతలవి నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారంటూ బీఆర్‌ఎస్ నేతలపై మండిపడ్డారు. దళితులకు 3 ఎకరాలు ఇస్తామని చెప్పి దగా చేశారన్నారు. కేజీ టు పీజీ విద్య హామీ ఎక్కడికి పోయిందని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇకపై పాలమూరు గడ్డపై బీఆర్‌ఎస్ గుర్తు మాయమని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. మీ పాలమూరు బిడ్డగా రెండురోజులుగా జిల్లా రైతులకోసం సాగునీరు ప్రాజెక్టులను పరిశీలించానన్నారు. వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు మనకు తెలుసని అన్నారు. పాలమూరులో ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా ఇక్కడికి రాజకీయంగా వలసవచ్చిన కేసీఆర్ ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిని చేస్తే..
పదేళ్లలో పాలమూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. పాలమూరులో గెలిపిస్తే పారిపోయి గజ్వేల్ లో పోటీ చేసిన కేసీఆర్ పాలమూరు ద్రోహినా? నేను పాలమూరు ద్రోహినా అంటూ నిలదీసారు. పాలమూరు జిల్లాలో 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నాం.మీ పాలమూరు బిడ్డగా జిల్లాలో ప్రాజెక్టుల కోసం ఈ 30 నెలల్లో 8 వేల కోట్లు ఖర్చు చేశా.జైళ్లు కట్టాలని వాళ్లు అనుకుంటే స్కూళ్లు కట్టాలని మనం అనుకున్నాం.ఏం చదవాలన్నా పాలమూరు జిల్లాకు వచ్చేలా కొడంగల్ లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నాం. చదువొక్కటే మీ జీవితాల్లో వెలుగు నింపుతుంది.. పిల్లల్ని చదివించండి? చదువుకుంటేనే బతుకులు బాగుపడతాయి జిల్లాల్లో వలసలు ఆగాలన్నా, రైతులు సంతోషంగా ఉండాలన్నా పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తి కావాలన్నారు. పాలమూరు ప్రజలు మట్టి తీసుడే కాదు? మట్టితో కప్పడం కూడా తెలుసన్నారు. రేవంత్ రెడ్డి ఏం చేసిండని కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారు.15 లక్షల రేషన్ కార్డులు అందించాం.4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాం. పది వేల కోట్లు మహిళలకి ఉచిత బస్సు ప్రయాణానికిఖర్చు చేశాం ఇలా మేం చేసింది చెప్పాలంటే రాస్తే రామాయణం.. చెబితే భారతం . మీ పదేళ్ల పాలనపై, మా రెండున్నరేళ్ల పాలనపై చర్చిద్దాం.. కేసీఆర్ అసెంబ్లీకి రా అంటూ సవాల్ చేశారు. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేసే బాధ్యత నాదని అన్నారు. 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని, 2029 లో కాంగ్రెస్ ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి,స్థానిక ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

## జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్

మొదటిపేజీ తరువాయి

మధ్యాహ్నం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు.
రమేష్ 2015 నుంచి పవన్ కల్యాణ్‌తో, జనసేన పార్టీతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సామాజిక వర్గాల మధ్య సఖ్యత, సోషల్ ఇంజినీరింగ్ అవసరమనే పవన్ ఆలోచనా విధానానికి ఆకర్షితులై ఆయనకు వెన్నుదన్నుగా నిలిచినట్లు పార్టీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.
2019 ఎన్నికల్లో పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చినప్పటికీ, రమేష్ పార్టీ సిద్ధాంతాలపై, పవన్ కల్యాణ్ నాయకత్వంపై పూర్తి విశ్వాసంతో నిలిచారని జనసేన తెలిపింది. ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లు ఎదురైనా పార్టీకి అండగా నిలిచిన వారికి కుల, మతాలు పరిగణనలోకి తీసుకోకుండా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలనే సూత్రం ప్రకారమే ఈ ఎంపిక జరిగినట్లు స్పష్టం చేసింది. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచినందుకే ఆయనకు ఈ అవకాశం కల్పించినట్లు పార్టీ వర్గాలు వివరించాయి.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

కొంతకాలంగా పరారీలో ఉన్న ఆయనను తమిళనాడులోని కాంచీపురంలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.గండిపేట, నార్సింగి ప్రాంతాల్లోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములకు సంబంధించి నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) సృష్టించి, వాటి ద్వారా అక్రమంగా విక్రయించేందుకు బ్రహ్మనాయుడు, మరికొందరు ప్రయత్నించినట్లు ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. ఈ భారీ భూ కుంభకోణం విలువ రూ.1,500 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.
ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. వారిచ్చిన సమాచారంతో ఈ కుంభకోణంలో బ్రహ్మనాయుడి పాత్రపై దృష్టి సారించారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న ఆయన కోసం గాలింపు చేపట్టి, చివరకు కాంచీపురంలో పట్టుకున్నారు. ఆయన్ను హైదరాబాద్‌కు తరలించి విచారించనున్నట్లు సమాచారం.

## దేశంలో కొందరు నిరాశావాదులు

మొదటిపేజీ తరువాయి

'గుజరాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అందుకే ముఖ్యమంత్రిని కూడా మార్చాల్సి వచ్చిందని ఇటీవల అక్కడ జరిగిన పరిణామలపై మోదీ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తమ కలలు, ఆకాంక్షలను కార్యరూపంలోకి రావాలనే పట్టుదలతో ఉన్నారని, దేశ ప్రజల సమష్టి సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల కాలంలో అనేక సంక్షోభాలను ప్రపంచం ఎదుర్కొందని, తొలుత కోవిడ్ సంక్షోభం, ఆ తర్వాత ఇంధన సంక్షోభం కుదిపేసిందని అన్నారు. పెట్రోల్ ధరల్లో నిలకడ లేకపోవడం, సప్లయ్ చైన్స్ కుప్పకూలడం వంటివి చోటచేసుకున్నాయని, అయితే ప్రతి సంక్షోభాన్ని 140 కోట్ల మంది ప్రజలు సమష్టిగా ఎదుర్కోవడం తనకెంతో తృప్తినిచ్చిందని అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా సూరత్‌లో రూ.18,800 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

## కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ ఇండ్లు

మొదటిపేజీ తరువాయి

కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలంలో వారి వాటాకు యజమానిని చేస్తూ పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షలు, మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే పరరిపాలనపరమైన అనుమతులు ఇచ్చినట్టు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్ నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించిందని మంత్రి విమర్శించారు. ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో, వారి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారని తప్పుపట్టారు.రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి దూరమవడంతో పాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదని వివరించారు. ఫలితంగా ఆ గృహాలు ఖాళీగా, నిరుపయోగంగా మిగిలిపోయాయని చెప్పారు. ఇలాంటి తప్పిదాలను పునరావృతం చేయకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని స్పష్టం చేశారు. ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ లక్ష ఇండ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్టు మంత్రి తెలిపారు. సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు. పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్ లను రూపొందించాలనీ, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రెటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# జల హక్కులను కాపాడాలి

**కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణది కనిష్ట స్థాయి**

**లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు (24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి**

**తగిన నిధులు కేటాయించి పనులను పూర్తి చేయాలి :**

**సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ**

**హైదరాబాద్ జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**



కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం ఏర్పడిందని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శు క్రవారం హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో ఈ ఏడాది ఏప్రిల్ ఏడున లేఖ రూపంలో బీఆర్‌ఎస్ చేసిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. అందువల్లే పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చెందిందని విమర్శించారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని పేర్కొన్నారు. కృష్ణా జలాల వినియోగంలో చారిత్రక కనిష్ట స్థాయికి తెలంగాణ దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ 74.90 శాతం వినియోగిస్తే, తెలంగాణ 25.10 శాతానికి పరిమితం అయ్యిందని వివరించారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలో పడేసిందని తెలిపారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలతో సాగునీటి రంగానికి ముప్పు అని పేర్కొన్నారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని కోరారు. కాళేశ్వరం, దేవాదుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించి పనులను పూర్తి చేయాలని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాల పూర్తి వినియోగం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయం, తాగునీరు, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి తదితర రంగాలకు తగిన నీటి లభ్యతను నిర్ధారించాలని కోరారు.

# వార్తలతో కదిలిన యంత్రాంగం

## ఇటుక బట్టీలకు మట్టి తరలింపుపై అధికారుల ఆంక్షలు








ఉపాధి మట్టిపై అధికారుల మౌనం!

చెరువు నుంచి ఇటుక బట్టీలకు రాగడి మట్టి తరలింపు?

వార్తలు వచ్చినా స్పందించని యంత్రాంగం -అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

నర్సంపేట, /జూన్ 4 (జర్నలిస్ట్ వార్త): ప్రజాధనంతో చేపట్టిన ఉపాధి హామీ పనుల మట్టిపై అనుమానాలు వ్యక్తమవుతున్నా సంబంధిత అధికారులు మౌనం వీడకపోవడం విమర్శలకు దారితీస్తోంది. చెన్నారావుపేట మండలం కోపాకుల చెరువులో వంద రోజుల ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పూడికతీత పనుల్లో వెలికితీసిన రాగడి మట్టిని రైతుల పొలాలకు కాకుండా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి.
ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు, పత్రికా కథనాలు వెలువడినా సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువు నుంచి ట్రాక్టర్ల ద్వారా రాత్రింబవళ్లు మట్టి తరలింపు జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.స్థానికుల కథనం ప్రకారం ఉపాధి పనుల కింద తవ్విన రాగడి మట్టి పెద్ద ఎత్తున ఇటుక బట్టీలకు చేరుతోంది. అయితే ఈ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాల్సిన అధికారులు భిన్నమైన వాదనలు వినిపించడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. తహసీల్దార్ మాత్రం ఇరిగేషన్ శాఖ అనుమతి ఇచ్చిందని చెబుతుండగా, ఎంపీడీవో కార్యాలయ వర్గాలు మట్టి రైతుల పొలాలకు తరలిస్తున్నట్లు పేర్కొంటున్నాయి. ఒకే అంశంపై రెండు శాఖలు వేర్వేరు వివరణలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఇటుక బట్టీ యజమాని సైతం చెరువు వద్దే మట్టిని ఆపాలి. నా వద్దకు ఎందుకు వస్తున్నారు అంటూ అధికారులకే విషయం తెలిసే మట్టి వస్తోందని వ్యాఖ్యానించడం గమనార్హం. అధికారుల అనుమతి లేకుండా లేదా పర్యవేక్షణ లేకుండా వందలాది ట్రాక్టర్ల మట్టి తరలింపు ఎలా సాధ్యమైందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రజాధనంతో చేపట్టిన పనుల్లో వెలికితీసిన మట్టి నిజంగా రైతుల పొలాలకు చేరుతోందా? లేక ఇటుక బట్టీలకు మళ్లించబడుతోందా? అనే అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణ విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేరుకే ఉపాధి హామీ..
లబ్ధి ఇటుక వ్యాపారులకే!
-చెన్నారావుపేట మండలం కోపాకుల చెరువులో మట్టి అక్రమ రవాణా
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మట్టి తరలింపుపై కథనం

మట్టి ఎక్కడికి..?
ఉపాధి హామీ నిధులతో చేపట్టిన చెరువు పూడికతీత పనుల మట్టి గమ్యం ఏమిటన్న ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. శాఖల మధ్య సమన్వయ లోపమా? లేక అక్రమాలపై మౌనమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**నర్సంపేట/జూన్ 5 (జర్నలిస్ట్ వార్త)**
చెన్నారావుపేట మండలంలోని కోపాకుల చెరువు నుంచి ఉపాధి హామీ పనుల కింద తవ్విన రాగడి మట్టిని రైతుల పొలాలకు తరలించాల్సి ఉండగా, కొందరు వ్యక్తులు ఇటుక బట్టీలకు మళ్లిస్తున్నారనే కథనం వెలువడిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజాధనంతో చేపడుతున్న పనుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు రావడంతో అధికారులు రంగంలోకి దిగారు. శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన అధికారులు చెరువు నుంచి తీసే మట్టి రైతుల పొలాలకు మాత్రమే చేరేలా కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. ట్రాక్టర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, రైతుల పొలాలకు నేరుగా మట్టి తరలించేలా చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలకు విరుద్ధంగా ప్రజా వనరులను వ్యక్తిగత లాభాలకు వినియోగిస్తే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది. గతంలో జరిగిన మట్టి తరలింపులపై కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఎంపీడీవో ఆదేశాల మేరకు క్లస్టర్ టీఏ సుధాకర్, ఈసీ కిషోర్, కార్యదర్శి సుప్రజ, ఫీల్డ్ అసిస్టెంట్ కవిత, కారోబార్ సురేష్ తదితరులు పనులను పర్యవేక్షించారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా నిరంతర పర్యవేక్షణ అవసరమని రైతులు కోరుతున్నారు. అధికారులు ప్రస్తుతం స్పందించినా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విచారణ జరపాలని ప్రజల డిమాండ్

**వైరా,/ జూన్ 5 (జర్నలిస్ట్ వార్త):**

ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పేదలకు అందించాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిపోతుందనే అనుమానాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణల మేరకు, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం పొరుగు రాష్ట్రాలకు తరలుతున్నట్లు ప్రచారం జరుగుతోందని, ఈ వ్యవహారంపై ఆహార సరఫరాల శాఖ, విజిలెన్స్ మరియు పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వం పేదల ఆహార భద్రత కోసం అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమ మార్గాల్లో మళ్లించబడితే నిజమైన లబ్ధిదారులు నష్టపోయే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల రేషన్ బియ్యం కొనుగోలు, నిల్వ, రవాణా అంశాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.
అక్రమ రవాణా జరిగినట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తులు, మధ్యవర్తులు, వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన నారపోగు ప్రసాద్ బాబు



**తల్లాడ,/ జూన్ 5 (జర్నలిస్ట్ వార్త):**తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో నిర్వహించిన ఓణీలు, పంచకట్టు వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నారపోగు నాగరాజుఅనూష దంపతుల కుమార్తె, కుమారుడి శుభకార్య వేడుకల్లో కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు చిన్నారులను ఆశీర్వదించి వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నారపోగు అక్కమ్మ, నారపోగు విజయ్ బాబు, నారపోగు రాఖి తదితర కుటుంబ సభ్యులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. వేడుకలు ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడ్డాయి.

# ఆరేపల్లిలో బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం

## అక్రమ మద్యం విక్రయాలకు చెక్.. గ్రామసభలో కీలక తీర్మానం

**ఎల్కతుర్తి,/ జూన్ 5 (జర్నలిస్ట్ వార్త):**
గ్రామంలో మద్యపానాన్ని నియంత్రించి యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ఎల్కతుర్తి మండలంలోని ఆరేపల్లి గ్రామపంచాయతీ సంచలన నిర్ణయం తీసుకుంది. గ్రామంలో బెల్ట్‌షాపులు, అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించింది.
సర్పంచ్ పోతారబోయిన స్రవంతి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామస్తులు మద్యపానం కారణంగా కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయని, యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల అనేక కుటుంబాల్లో విషాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలను ఏమాత్రం సహించబోమన్నారు. బెల్ట్‌షాపుల నిర్వహణ,



నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలపై సంబంధిత శాఖల సహకారంతో చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. గ్రామాన్ని మత్తురహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.
చిన్న గ్రామం.. పెద్ద ఆలోచన
మండలంలోని అతి చిన్న గ్రామపంచాయతీల్లో ఒకటైన ఆరేపల్లి అభివృద్ధి, సామాజిక సంస్కరణల విషయంలో ఆదర్శంగా నిలుస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గత పాలకవర్గాలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు కొనసాగింపుగా ప్రస్తుత సర్పంచ్ స్రవంతి రాజు గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి వసతులు, రైతులు, ప్రజల కోసం విశ్రాంతి కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.
గ్రామాభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తూ మద్యపాన నియంత్రణకు చర్యలు చేపట్టడం అభినందనీయమని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ప్రజల సహకారంతో ఆరేపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ స్రవంతి రాజు తెలిపారు.

# కవిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

## ఎన్టీఆర్‌ను అవమానించే ప్రయత్నాలను సహించం: టీడీపీ నాయకుడు ప్రసాద్ బాబు

**సత్తుపల్లి,/ జూన్ 5 (జర్నలిస్ట్ వార్త):**

హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసినట్లు ప్రచారంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి సంబంధించిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నారపోగు ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు.బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు ఎన్టీఆర్ పట్ల అవమానకరంగా భావించే వ్యాఖ్యలు ప్రజల్లో ఆగ్రహానికి దారితీస్తాయని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ మహనీయుల వారసత్వాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు.రాజకీయ నాయకులు ప్రజా జీవితానికి తగిన హుందాతనాన్ని పాటించాలని, వ్యక్తిగత విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలపై చర్చ జరగాలని సూచించారు. ఎన్టీఆర్‌కు కోట్లాది మంది అభిమానులు ఉన్నారని, ఆయనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.ఇకపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజా భావోద్వేగాలను గౌరవించాలని ఆయన కోరారు. ఈ మేరకు ప్రసాద్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు.

# సర్పంచ్ తీరు పై వార్డు సభ్యుల తిరుగుబాటు!

**ఏకపక్ష నిర్ణయాలతో పంచాయతీ పాలన గాడి తప్పిందంటూ ఫిర్యాదు**

**సమస్యలు పరిష్కరించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటూ హెచ్చరిక**

**ఎల్కతుర్తి, /జూన్ 5 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి గ్రామపంచాయతీలో సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలతో పాలన సాగుతోందని ఆరోపిస్తూ ఎనిమిది మంది వార్డు సభ్యులు మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) రవిబాబును కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామాభివృద్ధి పనులు, నిధుల వినియోగం, పాలకవర్గ సమావేశాల నిర్వహణలో పారదర్శకత లేకపోవడంతో పాటు సభ్యులను పూర్తిగా విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పంచాయతీ చట్టం ప్రకారం సభ్యులకు తెలియజేయాల్సిన వివరాలు వెల్లడించడం లేదని, సమావేశాల్లో




తీసుకున్న తీర్మానాలు అమలు కావడం లేదని వారు ఆరోపించారు. అవసరం ఉన్న పనులను పక్కనపెట్టి, కొందరికి అనుకూలంగా ఉండే పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు.
వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వార్డుల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీలు, తాగునీరు, వీధి సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ వాటి పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని పేర్కొన్నారు. ప్రజలు తమను నిలదీస్తున్నా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం స్పందించడం లేదని వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామపంచాయతీ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపీవోను కోరారు. అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉన్నతాధికారులను ఆశ్రయించి ఉద్యమం చేపట్టేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.ఈ సందర్భంగా వార్డు సభ్యులు నాంపల్లి మమత, మాటూరి వసంత, శోభారాణి, అంబాల ప్రత్యూష, జన్నారపు వెంకటేష్, కొత్తకొండ అజయ్, వేముల నవీన్, శనిగరపు సాహు పాల్గొన్నారు.

# యేసయ్య మహిమ సభలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలి.

## పాస్టర్ మేకల ప్రసాద్ రావు

**తల్లాడ/జూన్ 5 (జర్నలిస్ట్ వార్త):**

తల్లాడ మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో నిర్వహించనున్న యేసయ్య మహిమ సభలకు క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో హాజరై ఆశీర్వాదాలు పొందాలని దైవ సేవకులు పాస్టర్ మేకల ప్రసాద్ రావు పిలుపునిచ్చారు.గురువారం ఆయన మాట్లాడుతూ, జూన్ 5, 6 తేదీలలో అన్నారుగూడెం గ్రామంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో ప్రత్యేక ఆధ్యాత్మిక సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలు దేవుని మహిమకు కారణమయ్యేలా విజయవంతంగా జరగాలని, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండాలని విశ్వాసులందరూ ప్రార్థనలు చేయాలని కోరారు.అలాగే సేవకులు, సేవకురాళ్లు, సంఘ పెద్దలు తమ తమ సంఘాల సభ్యులను వెంట తీసుకుని వచ్చి సభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలు విశ్వాసులలో ఆత్మీయ చైతన్యం పెంపొందించడంతో పాటు దేవుని సందేశాన్ని మరింత విస్తృతంగా చాటిచెప్పేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంఘ నాయకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

# బయ్యారంలో విత్తన టాస్క్ ఫోర్స్ అవగాహన సమావేశం.

**బయ్యారం/,జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల విత్తన టాస్క్ ఫోర్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గార్ల బయ్యారం సీఐ రవీందర్,తహసీల్దార్ నాగరాజు,మండల వ్యవసాయ అధికారి కే.రాజు మండలంలోని విత్తనాలు,ఎరువులు, పురుగుమందుల విక్రయదారులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో నాణ్యమైన విత్తనాల విక్రయం,విత్తన చట్టాల అమలు,రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాల అందుబాటు తదితర అంశాలపై చర్చించారు.అనంతరం బయ్యారం మండలంలో వరి,మొక్కజొన్న ధాన్య సేకరణ కార్యక్రమాలను




విజయవంతంగా పూర్తి చేయడంలో అందించిన సహకారం,సమన్వయం మద్దతుకు గుర్తింపుగా బయ్యారం సీఐ,తహసీల్దార్లను వ్యవసాయ శాఖ వారు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల ఫర్టిలైజర్



అసోసియేషన్ అధ్యక్షులు సూరం సుధాకర్ రెడ్డి,ఇతర యజమానులు సతీష్, శేషగిరిరావు, శివ,విష్ణు,బాషా, క్రాంతి,కలింగరెడ్డి, మీరా,ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

**నేల సారాన్ని పెంచి, సాగు ఖర్చులు తగ్గించుకోవాలి కాపా సుధాకర్**



**తల్లాడ/ జూన్ 5 (జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట (జీలుగు) విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు పచ్చిరొట్ట జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. పచ్చిరొట్ట పంటల సాగు ద్వారా భూమిలో సేంద్రీయ పదార్థాల శాతం పెరిగి నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని, రసాయన ఎరువుల వినియోగం తగ్గి సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు.రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఎక్కువ లాభాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వం, సహకార సంఘాల ద్వారా అందిస్తున్న వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్ రెడ్డి, సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, గోవింద్ శీను, ఉపసర్పంచ్, కర్నాటి లక్ష్మిరెడ్డి, వ్యవసాయ అధికారి తాజుద్దీన్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు పోరాడితేనే దక్కుతాయి!

**సంఘటిత శక్తితో సంక్షేమ చట్టాల అమలుకు ఉద్యమించాలి గిన్నారపు మహేందర్**

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూన్ 5 (జర్నలిస్ట్ భర్త):**భవన నిర్మాణ కార్మికులకు చట్టాలు కల్పించిన హక్కులు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా కార్మికులు ఐక్యంగా పోరాడాలని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్ పిలుపునిచ్చారు. హక్కుల కోసం సంఘటిత ఉద్యమాలే శాశ్వత పరిష్కార మార్గమని ఆయన స్పష్టం చేశారు.భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ఆదేశాల మేరకు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో జిల్లా హడక్ కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బస్కె దశరథంతో కలిసి నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా కన్వీనర్‌గా కొత్తపెల్లి బిక్షపతి, కో-కన్వీనర్లుగా గిన్నారపు రవి, బైరపాక కుమార్, రేణుమల్ల శ్యామ్, కోడూరి లింగస్వామి, బొట్ల ప్రభాకర్, ముత్యం అశోక్, అంబాల రవీందర్, అంబాల సంపత్, వల్లేపు రమేష్లను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ, 1996 భవన నిర్మాణ




కార్మికుల సంక్షేమ చట్టం ద్వారా కల్పించిన ప్రయోజనాలు అర్హులైన ప్రతి కార్మికుడికి అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ బోర్డు పథకాల అమలులో ఉన్న లోపాలను ఎత్తిచూపుతూ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నెలలో జరగనున్న




ఉమ్మడి వరంగల్ జిల్లా కార్మిక మహాసభను విజయవంతం చేయాలని, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని తమ ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్మిక ప్రతినిధులు, భవన నిర్మాణ రంగ కార్మికులు పాల్గొన్నారు.

# మాదిగల్లో అక్షరాస్యత పెంపునకే

# పల్లెలకు తరలుదాం

**విద్యా, ఉద్యోగాల్లో ఎస్సీ వర్గీకరణ ఫలాలను అందుకోవాలి -జులై 7న ఎమ్మార్పీఎస్ పతాకోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం**

**దళిత రత్న పురస్కార గ్రహీత, సంఘం జిల్లా పర్యవేక్షకులు బిర్రు మహేందర్ మాదిగ**





**భువనగిరి/ జూన్ 5(జర్నలిస్ట్ వార్త):**
మాదిగ సామాజిక వర్గంలో బడిబాట వీడుతున్న విద్యార్థుల సంఖ్యను తగ్గించి, విద్యా అవకాశాలను మెరుగుపరచడం ద్వారా అక్షరాస్యతను పెంపొందించడమే లక్ష్యంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో గో టు విలేజ్‘ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా పర్యవేక్షకులు, దళిత రత్న పురస్కార గ్రహీత బిర్రు మహేందర్ మాదిగ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బాలంపల్లి గ్రామంలోని షెడ్యూల్డ్ కులాల సామాజిక భవనంలో శుక్రవారం సంఘం నాయకులు, మాదిగ విద్యార్థుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, విద్యా, ఆర్థికాభివృద్ధి సర్వే నివేదిక ప్రకారం అక్షరాస్యతలో మాదిగలు తీవ్రంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మాదిగ సమాజానికి విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, వారిని చైతన్యపరచడానికి ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు నేటి నుండి జులై 5 వరకు నలభై రోజుల పాటు ప్రతి గ్రామంలో చైతన్య సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



**వర్గీకరణ ఫలాలను అందుకోవాలి..**

తెలంగాణలో షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ అమలులోకి వచ్చినందున, మాదిగలకు దక్కిన తొమ్మిది శాతం రిజర్వేషన్ సదుపాయాలను విద్యార్థులు, యువత పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటంతో సాధించుకున్న వర్గీకరణ ఫలాల ద్వారా ఉన్నత విద్యా రంగంలో, ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగ జాతి ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఎవరూ చదువుకు దూరం కావద్దని, అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలు అభివృద్ధి సాధించాలంటే విద్య ఒక్కటే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ఉన్నత చదువుల కోసం అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ఉపయోగించుకోవాలని సూచించారు.

**జులై 7న జాతి పండుగ‘**

మాదిగ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జులై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ పతాకోత్సవాన్ని

జాతి పండుగలా ఘనంగా నిర్వహించుకోవాలని మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతి పల్లెలో నూతన శంకుస్థాపనలు చేసి, పతాక వేదికలను నిర్మించుకోవాలని కోరారు.

**సంఘం గ్రామ నూతన కార్యవర్గ ఎన్నిక**

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ సమక్షంలో బాలంపల్లి గ్రామ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులు కాశపాక ఆంజనేయులు మాదిగ, ప్రధాన కార్యదర్శి కళ్లెం ఉపేందర్ మాదిగఉపాధ్యక్షులు కళ్లెం దేవేందర్ మాదిగ,అధికార ప్రతినిధి కాశపాక ఐలయ్య మాదిగ,కార్యదర్శి బిక్షపతి మాదిగ,ప్రచార కార్యదర్శి తండ్ర రమేష్ స్వామి మాదిగ, లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షులు ఉపేందర్ మాదిగ, మండల కార్యదర్శి వైద్యులు మంచాల మహేశ్వర్ మాదిగ, ఉప సర్పంచ్ కాశపాక కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రీ ప్రైమరీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**జూన్ 8 సాయంత్రం 4 గంటల వరకు అవకాశం**

**ఎల్కతుర్తి,/ జూన్ 5 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఎల్కతుర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్రీ ప్రైమరీ టీచర్, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్దేశిత దరఖాస్తు నమూనాను పూర్తి చేసి అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు అందజేయాలని సూచించారు.

ఫ్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుకు అనుమతి లభించిన దండేపల్లి ప్రాథమిక పాఠశాల మరియు ఎల్కతుర్తి బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో ఈ నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఫ్రీ ప్రైమరీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హతలతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆయా పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణతతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్, జిరాక్స్ ప్రతులను సమర్పించాలని తెలిపారు.అర్హులైన స్థానిక అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మండల విద్యాధికారి కోరారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామసభ.





**బయ్యారం/,జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బయ్యారం సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ నిషేధించడం,దానికి అనుబంధంగా మాజీ ఎంపీపీ కిషన్ నాయక్ సొంత ఖర్చులతో పర్యావరణహిత బ్యాగ్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంపీడీవో మేడం దీపిక,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ విజయ్ కుమార్,పోలీస్ శాఖ తరపున ఎస్సై ప్రశాంత్ బాబు,ఐసిడిఎస్ సూపర్వైజర్,రెవెన్యూ డిపార్ట్మెంట్ నుండి జిపిఓలు,పంచాయతీ కార్యదర్శి కే.రాంబాబు,ఉప సర్పంచ్ ఉమా,వార్డు సభ్యులు, వివిధ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు,గ్రామ పుర ప్రముఖులు,గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనే లక్ష్యంగా పోలీసుల తనిఖీలు

**-ఎస్సై ప్రశాంత్ బాబు.**



**బయ్యారం/,జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**




మహబూబాబాద్ జిల్లాను గంజారహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశాల మేరకు బయ్యారం మండలంలో పాన్ షాపులు నిర్మానుష ప్రాంతాలలో డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని బయ్యారం సెంటర్ గాంధీ సెంటర్ ప్రధాన రహదారుల వెంట పాన్ షాపులు,బెల్ట్ షాపులలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించే నిర్మానుస్య ప్రాంతాలు అయిన గాజుల బోడు,టేకుల బోడు తదితర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంజా రవాణా చేసిన సేవించిన కఠిన చర్యలు తీసుకొని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.గాంజా వల్ల యువత మత్తుకు బానిస అవుతున్నారని వారిని సక్రమ మార్గంలో ఉంచేందుకు తల్లిదండ్రులు అందరు వారి పిల్లల పట్ల ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. గాంజా రవాణా సేవించేవారు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచి గంజా తాగే వారిని శిక్షిస్తామని తెలిపారు. నిర్మానుష ప్రాంతాలలో గాంజా సేవిస్తున్నట్లు అనుమానం వస్తే 8712656999 ఫోన్ కు కాల్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాపారావు,కోటేశ్వరరావు,శ్రీను,రమేష్, సుబ్రహ్మణ్యం,పాషా,తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో విషాదం.. నదిలో దిగి ముగ్గురి మృతి

**మృతులు అనిత (40), పావని (14), శివాని (13)గా గుర్తింపు**

**ప్రమాదం నుంచి ఒకరిని సురక్షితంగా కాపాడిన స్థానికులు**

**ఎల్లమ్మ గుడికి మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లగా ఘటన**



**కామారెడ్డిజూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**
కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బాన్సువాడ మండల పరిధిలో శుక్రవారం జరిగింది.వివరాల్లోకి వెళితే.. పిట్లం మండలం మంగళ్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు బాన్సువాడ మండలం బుడిమి సమీపంలోని ఎల్లమ్మ ఆలయానికి మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లారు. దర్శనం అనంతరం దగ్గరలోని మంజీరా నదిలో పుణ్యస్నానం చేసేందుకు దిగారు. అయితే, నీటి లోతు, ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వారు అదుపుతప్పి గల్లంతయ్యారు.వారి అరుపులు విన్న స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భాను ప్రసాద్ అనే వ్యక్తిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు. కానీ, అప్పటికే అనిత (40), ఆమె కుమార్తెలు పావని (14), శివాని (13) నీట మునిగి మృతి చెందారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. ఒకే కుటుంబంలో తల్లి, ఇద్దరు కుమార్తెలు మరణించడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మార్నేని దంపతులు



**ఐనవోలు/జూన్ 5(జర్నలిస్ట్ వార్త)::** మండల కేంద్రంలో శుక్రవారం ఓ వివాహ వేడుక వైభవంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొహమ్మద్ రహీమ్ పాషా సోదరుడు మొహమ్మద్ ఖాసీం కుమార్తె అస్మా వివాహం రఫీతో జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మధుమతి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కల్యాణ వేదికపై నూతన వధూవరులు అస్మా-రఫీలను మార్నేని దంపతులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. వధూవరులు నూరేళ్లు పచ్చగా, సుఖసంతోషాలతో విలసిల్లాలని వారు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరుల కుటుంబ సభ్యులకు మార్నేని రవీందర్ రావు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి పాల్గొని వరుడిని, వధువును దీవించారు. ఐనవోలు గ్రామ ఉపసర్పంచ్ బరిగెల భాస్కర్, మాజీ సర్పంచ్ జన్ను కుమారస్వామి కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

## సారయ్య చిత్రపటానికి మార్నేని రవీందర్ రావు నివాళి



**ఐనవోలు/ జూన్ 5(జర్నలిస్ట్ వార్త);**మండల పరిధిలోని నందనం గ్రామంలో బుర్ర రాజకుమార్ గౌడ్ తండ్రి బుర్ర సారయ్య ఇటీవల మృతి చెందారు. శుక్రవారం నందనం గ్రామంలో నిర్వహించిన సారయ్య దశదిన కర్మ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ టేస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సారయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సారయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమామిడిపల్లి మాజీ సర్పంచ్ ఆడప దయాకర్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారం

### ముత్తారం ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్





**భీమదేవరపల్లి/జూన్ 5 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, మొక్కల పెంపకం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్, వార్డు సభ్యులు పార్నందుల నవిత, దండెపల్లి శిరీష, మ్యాక నరేష్, కొర్ర తిరుపతి, కడారి చింటూ, దొండ మౌనిక, రేణికుంట్ల సందీప్, పంచాయతీ కార్యదర్శి నరేష్, జూనియర్ లైన్‌మెన్ రాజ్‌కుమార్, పంచాయతీ సిబ్బంది ఫిలిప్, ప్రేమానందం, కొమురయ్య, వీరమ్మ, వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్లు కవిత, సునీత, ఏఎన్‌ఎం వనజ, ఆశా కార్యకర్త భాగ్య, ఇతర సిబ్బంది మాలత, ప్రశాంత్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పుప్పాలగూడలో ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్

### అన్యాక్రాంతం కాకుండా కాపాడిన హైడ్రా

**హైదరాబాద్,జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)** హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ పరిధిలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. ప్రభుత్వ స్థలం చుట్టూ హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు. రూ.30వేల కోట్ల విలువైన భూమిని కాపాడినట్లు హైడ్రా తెలిపింది. పుప్పాలగూడ భూముల్లో చారిత్రక రాతి గుట్టలు ఉన్నాయి. ఈ భూములను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించింది.



చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతినిధులు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. గతంలో హైకోర్టును కూడా ఆశ్రయించారు. రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని రక్షించాలని ఉన్నత న్యాయస్థానం మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం కావడంతో భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ విషయాన్ని సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతినిధులు ఇటీవల హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు.

# నటన కాదు... మంచితనమే
# మనిషికి చిరస్థాయి గుర్తింపు

మానవ జీవితంలో వ్యక్తిత్వానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ఒక మనిషిని సమాజం అతని ఆస్తిపాస్తులు, హోదాలు, పదవుల ఆధారంగా కొంతకాలం మాత్రమే గుర్తుంచుకోవచ్చు. కానీ అతని మంచితనం, నిజాయితీ, నడవడిక, మానవత్వం ఆధారంగానే శాశ్వతంగా గుర్తుంచుకుంటుంది. నేటి సమాజంలో చాలా మంది తమ అసలు స్వభావాన్ని పక్కనబెట్టి నటనతో, ఆర్భాటంతో, మాటల గారడీతో ఇతరులను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. అయితే నటనతో పొందిన పేరు తాత్కాలికం మాత్రమే. మంచితనంతో సంపాదించిన గౌరవం మాత్రం తరతరాల పాటు నిలిచిపోతుంది.

నటన అనేది ఒక కళ కావచ్చు. కానీ జీవితంలో ప్రతి సందర్భంలో నటిస్తూ ఉండటం వ్యక్తిత్వాన్ని బలహీనపరుస్తుంది. మనసులో ఒకటి ఉంచుకుని బయటకు మరొకటి చూపించడం వల్ల కొంతకాలం ఇతరులను మోసం చేయవచ్చు. కానీ సత్యం ఎప్పటికైనా వెలుగులోకి వస్తుంది. అందుకే నటించడం నేర్చుకోవడం కంటే మనస్ఫూర్తిగా జీవించడం గొప్ప విషయం. మనిషి తన ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో నిజాయితీని ప్రతిబింబింపజేసినప్పుడే అతని జీవితానికి విలువ ఏర్పడుతుంది. మాటలతో మాయ చేయడం సులభమే. ఆకర్షణీయమైన ప్రసంగాలు, గొప్ప గొప్ప హామీలు, ప్రచార ఆర్భాటాలు కొంతకాలం ప్రజలను ప్రభావితం చేయవచ్చు. కానీ మాటలు కాకుండా చేతలు మాట్లాడినప్పుడే నిజమైన గౌరవం లభిస్తుంది. సమాజానికి సేవ చేసినవారు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచినవారు, కష్టకాలంలో తోడుగా ఉన్నవారే ప్రజల హృదయాల్లో స్థానం సంపాదిస్తారు. అలాంటి వ్యక్తులకు ప్రత్యేకంగా తమ గొప్పతనాన్ని చాటుకోవాల్సిన అవసరం ఉండదు. నీతి, నిజాయితీ ఉన్న చోట నటనకు స్థానం ఉండదు. ఎందుకంటే నిజాయితీ గల వ్యక్తి ఎప్పుడూ తన విలువలను వదులుకోడు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అతను ఒకే విధంగా



వ్యవహరిస్తాడు. తన ప్రయోజనం కోసం ఇతరులను మోసం చేయడు. తన మాటకు కట్టుబడి ఉంటాడు. సమాజంలో అలాంటి వ్యక్తులే ఆదర్శప్రాయులుగా నిలుస్తారు. వారి జీవితం కొత్త తరాలకు మార్గదర్శకంగా మారుతుంది.

నేటి డిజిటల్ యుగంలో ప్రచారం, ప్రదర్శన, కృత్రిమత ఎక్కువగా కనిపిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో కనిపించే ప్రతిదీ వాస్తవం కాదు. కొందరు తమ జీవితాలను గొప్పగా చూపించడానికి ప్రయత్నిస్తుంటే, మరికొందరు ప్రశంసల కోసం మంచి పనులను కూడా ప్రచార సాధనంగా మార్చుకుంటున్నారు. అయితే నిజమైన సేవకు ప్రచారం అవసరం లేదు. నిజమైన మంచితనానికి ప్రకటనలు అవసరం లేదు. స్వచ్ఛమైన మనసు, నిస్వార్థ సేవ, మానవత్వంతో కూడిన ప్రవర్తన ఏ ప్రచారం లేకుండానే ప్రజల మనసులను గెలుచుకుంటాయి. కృత్రిమత కంటే సహజత్వం గొప్పది. ఆర్భాటం కంటే ఆత్మీయత విలువైనది. సంపద కంటే సద్గుణాలు శాశ్వతమైనవి. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంతటి పదవులు పొందినా, అతని వ్యక్తిత్వమే అతనికి అసలైన గుర్తింపును తెస్తుంది. మంచితనం ఉన్నవారు మాటలతో కాదు, చేతలతో గుర్తింపు పొందుతారు. వారు సమాజంలో విశ్వసనీయతను సంపాదిస్తారు. ప్రజల గౌరవాభిమానాలకు పాత్రులవుతారు. అందువల్ల ప్రతి వ్యక్తి జీవితంలో నీతి, నిజాయితీ, మానవత్వం, సేవాభావం వంటి విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి. తాత్కాలిక గుర్తింపుకోసం నటించడం కంటే శాశ్వత గౌరవం కోసం మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలి. ఎందుకంటే నిజమైన వ్యక్తిత్వం నటనలో కాదు... మన ప్రవర్తనలో కనిపిస్తుంది. అదే మనిషిని సమాజంలో ఉన్నత స్థానానికి చేర్చే అసలైన శక్తి.



కొట్టే సుధాకర్ (లెనిన్)
సీనియర్ జర్నలిస్ట్
టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా
కార్యవర్గ సభ్యులు :9908401581

## పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి.

**-ఎఫ్ఆర్ఓ రవి కిరణ్.**

**బయ్యారం/,జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని బయ్యారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి కిరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు రైతు వేదిక ప్రాంగణంలో మండల తాహశీల్దార్ నాగరాజు,గార్ల- బయ్యారం సీఐ రవీందర్,అటవీ శాఖ అధికారులు వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని చెట్లు జీవులకు ప్రాణవాయువు



లాంటిదని అన్నారు. విరివిగా మొక్కలను నాటి సంరక్షించాలని,అడవులను కాపాడాలని వారు తెలిపారు. అనంతరం అటవీ శాఖ కార్యాలయం నుండి బయ్యారం బస్టాండ్ మీదుగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు అడవులను



కాపాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటాలని బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ డిఆర్ఓ రమాదేవి,బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం

### వెంటనే పాస్‌బుక్కులు అందించాలి: ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొట్టే ఏసేపు

**ధర్మసాగర్ /హనుమకొండ, బ్యూరో జూన్ 5 (జర్నలిస్ట్ వార్త):**సాదా బైనామా ద్వారా భూములు కొనుగోలు చేసి దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే పాస్‌బుక్కులు అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొట్టే ఏసేపు శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను రద్దు చేసి భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి విధానాన్ని తీసుకువచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదా బైనామా భూముల క్రమబద్ధీకరణకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే భూ భారతి కింద దరఖాస్తులు సమర్పించిన రైతులు ఇప్పటికీ రెవెన్యూ



కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాదా బైనామా దరఖాస్తుల పరిశీలనలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీనివల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి అర్హులైన రైతులకు పాస్‌బుక్కులు జారీ చేయాలని కోరారు.

రైతుల భూ హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత ఆలస్యం చేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# అర్ధరాత్రి ఇంట్లో పేలిని సిలిండర్

## అమ్మమ్మతో పాటు ఇద్దరు మనవళ్ల మృతి

**నల్లగొండ,జూన్ 5.(జర్నలిస్ట్ వార్త)**

నల్లగొండ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. మరణించిన వారిని అమ్మమ్మ వనం చంద్రకళ, మనుమడు లక్ష్మణ్ (16), మనమరాలు ప్రణతి (14) గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యభర్తలు. చంద్రకళ భర్త అనారోగ్యంతో కొన్ని రోజుల కిందటే మరణించాడు. ఇక చంద్రకళ పెద్ద కూతురు



ధనమ్మ భర్త పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్ (16), ప్రణతి (14)తో పుట్టింట్లోనే ఉంటోంది. ఉపాధి నిమిత్తం ఇళ్లలో పనిచేసేందుకు ధనమ్మ మూడు రోజుల కిందట పుణెళికు వెళ్లింది. ఇదిలా ఉంటే.. గురువారం రాత్రి మనుమడు, మనుమరాలితో చంద్రకళ తమ రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. విద్యుద్ఘాతం కారణంగా ఇంట్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇది గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాలను వెలికితీశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఘటనాస్థలిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా కాలిన మృతదేహాలను స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.